క్లుప్తంగా

పౌష్టికాహారంతో ఆరోగ్యం



అంబకండిలో కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

రేగిడి: పోషక విలువలున్న ఆహారాన్ని తింటేనే ఆరోగ్యవంతంగా ఉంటారని వైద్య సిబ్బంది సూచించారు. మండలంలోని బూరాడ, రేగిడి, ఉనుకూరు సెక్టార్ల పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం కిశోర బాలికలకు ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నూతన మెనూ ప్రకారం భోజనాలు పెడుతున్నారన్నారు. పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎటువంటి సమస్యలు వచ్చినా వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

గొడవలు వద్దు: ఎస్సై



సంకిలిలో పర్యటిస్తున్న ఎస్సై శ్రీనివాసరావు, సిబ్బంది

రేగిడి: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయని, ఇప్పుడు బెట్టింగ్‌లు, గెలుపు ఓటముల పేరుతో వివాదాలకు ఆస్కారమివ్వొద్దని ఎస్సై శ్రీనివాసరావు ప్రజలకు సూచించారు. మండలంలోని సంకిలి, కాగితాపల్లి తదితర గ్రామాల్లో బుధవారం సిబ్బందితో పర్యటించారు. ఇంకా ఎన్నికల కోడ్ అమలులో ఉందని, కోడ్ ఉల్లంఘనకు పాల్పడేవారిపై చర్యలు తీసుకుంటామన్నారు. గెలుపోటములను పార్టీల అభిమానులు సమానంగా తీసుకోవాలని, గొడవలు పడవద్దని సూచించారు.

బుక్ కీపింగ్ బాధ్యత వీఓఏలదే..



శిక్షణలో వివరాలు సేకరిస్తున్న ఏసీ చిరంజీవి

రేగిడి: గ్రామైఖ్య సంఘాల పుస్తక నిర్వహణ సక్రమంగా ఉండాలని, ఆ బాధ్యత వీఓఏలదేనని వైఎస్సార్ క్రాంతి పథం ఏసీ ఎ.చిరంజీవి అన్నారు. రేగిడి మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద అన్ని గ్రామాలకు చెందిన వీఓఏలకు బుధవారం బుక్ కీపింగ్‌లో శిక్షణ ఇచ్చారు. రెండురోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణ తరగతులను వీఓఏలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పుస్తకాల నిర్వహణ, గ్రామైఖ్య సంఘాలకు సదస్సుల ఏర్పాటు, నిధులు వినియోగం, చెల్లింపులు తదితర అంశాలపై ఈ శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎల్‌సీ ఏపీఎం దధికుమార్, స్థానిక ఏపీఎం గోవిందరావు, స్త్రీనిధి మేనేజర్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఊరటనిచ్చిన వర్షం



రేగిడిలో కురుస్తున్న వర్షం

రేగిడి: మండలంలో బుధవారం ఈదురుగాలులతో పాటు వర్షం కురిసింది. వేసవి ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు ఈ వర్షం ఎంతో ఉపశమనాన్ని ఇచ్చింది. వాతావరణం చల్లబడటంతో పాటు వాణిజ్యపంటలైన చెరుకు, వేరుశనగకు ఈ వర్షం జీవం పోసిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తాగునీరు వృథా చేయొద్దు



బొడ్డవలసలో కుళాయిలను పరిశీలిస్తున్న ఏఈ

రేగిడి: గ్రామాల్లో కుళాయిల ద్వారా వస్తున్న తాగునీటిని ప్రజలు వృథా చేయొద్దని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జి.శ్రీచరణ్ అన్నారు. మండలంలోని చిన్నయ్యపేట, సంకిలి, బొడ్డవలస తదితర గ్రామాల్లో తాగునీటి కుళాయిలను బుధవారం ఆయన పరిశీలించారు. వేసవిలో అన్ని గ్రామాలకు తాగునీరు అందే విధంగా చర్యలు చేపడుతున్నామని, ఇందుకు ప్రజలు కూడా సహకరించాలన్నారు. కుళాయిల వద్ద బట్టలు ఉతకడం, ఇంటి నిర్మాణాలకు పైపుల ద్వారా నీటిని తరలించడం వంటివి చేయరాదని కోరారు.

ఉపాధి పనుల పరిశీలన

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులను ఏపీఓ వెంకటప్పలనాయుడు బుధవారం పరిశీలించారు. కొలతల ప్రకారం రెండు పూటలా పనులు చేస్తే గరిష్ట వేతనం అందుతుందని చెప్పారు.

వేసవి దుక్కులతో పొలానికి ప్రాణం



పొలాన్ని దుక్కి చేస్తున్న రైతులు

- భూసారం పెరగడంతో పాటు అనేక లాభాలు
- మెట్టు, బీడు భూముల్లో దుక్కులను ఇదే అదును



టి.కన్నబాబు, ఏఓ

వంగర: వేసవి దుక్కులతో భూమికి ఎంతో మేలు జరుగుతుందని వ్యవసాయాధికారి తట్టికోట కన్నబాబు తెలిపారు. ఏప్రిల్, మే నెలల్లో మెట్టు, బీడు భూములను దుక్కి చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతలకు వివరించారు. దుక్కి చేసేముందు పొలంలో పశువుల ఎరువు లేదా కంపోస్టు, నేల స్వభావాన్ని బట్టి చెరువు మట్టిని వేసుకోవాలి. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకల మందలను వదలటం వల్ల అవి విసర్జించే మలమూత్రాలు సేంద్రియ ఎరువుగా మారి భూసారం వృద్ధి చెందుతుంది. ఇలా చేయడం వల్ల నేల సారవంతం అవడమే కాకుండా తేమను ఎక్కువ సమయం నిలుపుకుంటుంది. వేసవి దుక్కులు లోతుగా దున్నాలి. దీని వల్ల భూమిలోపలి పొరలు గుల్లబారుతాయి. తద్వారా నీటిని నిల్వ ఉంచుకునే శక్తి పెరుగుతుంది. పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు, వానపాముల సంతతి వృద్ధి చెందుతుంది. వేసవి దుక్కుల వల్ల నేల పొలల్లో పాతుకుపోయిన కలుపు మొక్కలు, పంటలను ఆశించే పలు రకాల పురుగుల ప్యూపాలు, శిలీంద్ర బీజాలు వంటివి పైకి రావడం ద్వారా ఎండకు ఎండిపోయి నశిస్తాయి. ఫలితంగా పంట సాగు సమయంలో కలుపు, చీడపీడల నివారణపై రైతులు పెట్టే ఖర్చు తగ్గుతుంది. వేసవి దుక్కులతో నేల గుల్లబారడంతో మొక్కల వేర్లు భూమి లోతుల్లోకి చొచ్చుకుపోయి లోపలిపొరల్లో ఉన్న నీరు, పోషకాలను గ్రహించే అవకాశం ఉంటుంది. క్షారత్వం ఎక్కువగా ఉన్న నేలల్లో లోపలి పొరలు గట్టిపడి మురుగునీరు పోవు సౌకర్యం తగ్గిపోతోంది. లోతు దుక్కులు మూలంగా క్షారాలు, లవణాలు భూమి పొరల్లోకి లోతుకు జారిపోయే అవకాశం ఉంది.

గుర్తుంచుకోవాల్సిన అంశాలు

- వేసవి దుక్కులు వాలుకు అడ్డంగా దున్నాలి. వాలుకు నిలువుగా దున్నితే నేల కోతకు గురై భూమిలోని సారవంతం కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. వాలుకు అడ్డగా దున్నటం మూలంగా వర్షం నీరు భూమి లోపలికి ఎక్కువగా ఇంకి పోతోంది. క్రమేణా వాలు కూడా తగ్గిపోతోంది.
- వేసవిలో వర్షాలు కురిసిన వెంటనే పొలాలను దున్నేందుకు ప్రత్యేకమైన పనిముట్లు వాడాలి. కల్టివేటర్ భూమిని 5–10 సెంటీమీటర్ల మేర మాత్రమే దున్నటం వల్ల పెద్దగా మేలు జరగదు. దుక్కి లోతుగా దిగేందుకు పల్లెపు నాగలి లేదా డిస్క్ టిల్లర్, రొటేవేటర్‌ను వాడాలి.
- రెక్కల నాగలి దుక్కిని లోతుగా దున్నటంతో పాటు, పైకి లేచిన మట్టిపెళ్లలను ఎప్పటికప్పుడు తిరబడేలా చేస్తుంది. మామూలు రొటేవేటర్‌తో వచ్చే దుక్కి కన్నా అది మేలుగా ఉంటుంది. అయితే దుబ్బలు, రాళ్లు లేని పొలాల్లో మాత్రమే ఇది వీలు పడుతోంది.
- పల్లెపు నాగలిని మాత్రం దుంపలు, రాళ్లు ఎక్కువగా ఉన్న భూముల్లో కూడా ఉపయోగించుకోవచ్చు. భూమిలో తేమశాతం ఎక్కువగా ఉన్న సమయంలో పల్లెపు నాగలి కూడ ఉపయోగించుకోవచ్చు. దుక్కి సమయంలో లేచిన పెళ్లలను దంతె సేద్యం చేయడం ద్వారా పొలాలను చదును చేసుకోవచ్చు.

బొబ్బిలి ఓటర్లకు కృతజ్ఞతలు



- ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో పాల్గొని తనకు మద్దతిచ్చిన ఓటర్లకు, తన గెలుపు కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఉదయం తీవ్రమైన ఎండ, సాయంకాలం ఈదురు గాలులు, వర్షం వంటి భిన్నమైన వాతావరణ పరిస్థితులు ఉన్నా ఓటర్లంతా తనకు సహకరించారన్నారు. నియోజకవర్గ ప్రజలు తన విజయాన్ని వారి విజయంగా భావించి తనకు ఓటు వేసేందుకు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారని, పోలింగ్ సరళిని చూస్తే తాను భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి మరింతగా కృషిచేస్తానన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తలే రాజేష్, తదితరులు

రాజాం: మండలంలో పెనుబాక గ్రామంలో 300 మంది పేదలకు బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్‌సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ చేతులమీదుగా గ్రామానికి చెందిన జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ నర్సింహులు చేస్తున్న సేవా కార్యక్రమాలను ఎమ్మెల్సీ విక్రాంత్ కొనియాడారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకుని పేదలకు సాయం చేసేందుకు మరింత మంది ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బండి శ్రీనివాసరావు, బండి కోటి, బింగి వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ రాజాం రూరల్, పట్టణ కన్వీనర్లు లావేటి రాజగోపాలనాయుడు, పాలవలస శ్రీనివాసరావులు, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, యూత్ అధ్యక్షుడు గెడ్డాపు అప్పలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ కామోదుల శ్రీరంగంనాయుడు, స్థానిక సర్పంచ్ బండి బోడమ్మ, ఎంపీటీసీ కోటీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

రంగనాథం మాస్టారుకు సత్కారం



రంగనాథం దంపతులను సత్కరిస్తున్న తూర్పుకాపు సంక్షేమ సంఘ పెద్దలు

రాజాం: వరంగల్‌కు చెందిన శ్రీలేఖ సాహితీ సంస్థ అందించిన చెన్నమ్మనేని రంగనాయకమ్మ విశిష్టాద్వైత పురస్కారాన్ని పొందిన రాజాం రచయితల వేదిక నిర్వాహకులు గార రంగనాథం మాస్టారును రాజాం ప్రాంతీయ తూర్పుకాపు సంఘం బుధవారం ఘనంగా సత్కరించింది. రాజాంలోని ఆయన స్వగృహంలో రంగనాథంతో పాటు అతని సతీమణి సీతారత్నంను సంఘ సభ్యులు సత్కరించారు. రంగనాథం మాస్టారు 'రారవే' ద్వారా రాజాం కవుల, రచయితల కవితలను, రచనలను ప్రపంచానికి పరిచయం చేస్తున్నారని కొనియాడారు. ప్రతీ నెల క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించడం, కొత్త రచయితలను, కొత్త గ్రంథాలు, పుస్తకాలను సమాజానికి పరిచయం చేయడం వంటివి చేస్తున్నారని పేర్కొన్నారు. ఆయన రచించిన రాయరత్న మంజూష గ్రంథానికి చెన్నమ్మనేని రంగనాయకమ్మ విశిష్టాద్వైత పురస్కారం లభించిందని, ఈనెల 12న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయనాయుడు చేతులమీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో రాజాం పట్టణంతో పాటు రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాలుకు చెందిన పలువురు కవులు, రచయితలు, ఉపాధ్యాయులు, సామాజిక సేవా కార్యకర్తలు పాల్గొన్నారు.

అపరాల పంటకు డిమాండ్

రాజాం: రబీలో రైతులు సాగుచేసిన అపరాల పంటకు మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. ఈ ఏడాది రైతులు రబీలో అపరాల పంటలైన మినుములు, నల్లపెసర, పెసర, తదితర పంటలను సాగు చేశారు. ప్రస్తుతం పంట దిగుబడి చేతికందుతోంది. ఎకరకు రెండున్నర నుంచి మూడు క్వింటాళ్ల వరకు దిగుబడి అందుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా మినుములు రూ.7200, నల్లపెసర, పెసర పంట క్వింటాకు రూ.7400 నుంచి రూ.7800 వరకు ధర పలుకుతోంది. డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని పలువురు వ్యాపారులు పంటనూర్పిడి పూర్తికాకముందే రైతులకు ముందుగానే అడ్వాన్సులు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. పంట సాగుకు అయ్యే ఖర్చులన్నీ పోనూ రైతుకు కొంత ఆదాయం మిగులుతోంది.

నిబంధనలు పాటించాలి: సీఐ

రాజాం సిటీ: వాహనదారులు నిబంధనలు పాటించాలని రాజాం టౌన్ సీఐ మోహనరావు అన్నారు. పట్టణంలోని చీపురుపల్లి రోడ్డులో బుధవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు రోడ్డు భద్రత నిబంధనలు, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకువెళ్లకూడదని డ్రైవర్లకు సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడంతో పాటు లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు.

మృతురాలి ఆచూకీ లభ్యం

బొబ్బిలి: మండలంలోని రాముడువలస–శివడవలస గ్రామాల మధ్యలో గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని మంగళవారం రాత్రి పోలీసులు గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. మృతి చెందిన మహిళ వివరాలను సేకరించారు. ఆమె పార్వతీపురం సమీపంలోని చినబొండపల్లికి చెందిన రేగు పైడితల్లి(60)గా గుర్తించారు. మతిస్థిమితం లేకపోవడంతో ఊరూరా తిరుగుతూ ఉండేదని, ఈ క్రమంలోనే తన తాతగారి ఊరైన బొబ్బిలి మండలం కొండదేవుపల్లికి కొద్దిరోజుల కిందట వచ్చినట్లు చెప్పారు. ఎండ వేడికి తాళలేక మృతి చెంది ఉంటుందని పోలీసులు తెలిపారు.

చెరువుల్లో జలకళ



వన్నలిలో నిండుకుండలా ఉన్న అన్నారాయునిచెరువు

రేగిడి: మండువేసవిలో కూడా మండలంలో అన్ని పంచాయతీల్లోని సాగునీటి చెరువులు జలకళతో కనిపిస్తున్నాయి. గతేడాది ప్రణాళికాబద్ధంగా చెరువులో ఉపాధిపనులు చేసి, పూడికలు తొలగించారు. దీంతో పాటు ఇటీవల వర్షాలు కురవడం, మడ్డువలస నీటిని విడిచిపెట్టడంతో చెరువులు నిండుకుండలా నీటితో కళకళలాడుతున్నాయి. కాలువలు, వర్షాలు ద్వారా వచ్చిన నీరు చెరువుల్లో చేరడంతో ఆయకట్టు రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తలేదు. మండలంలో మొత్తం 128 సాగునీటి చెరువులు ఉన్నాయి. అన్నింటిలో ప్రజల అవసరాలకు తగ్గట్లు నీరు ఉంది.

వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభం



వేసవి విజ్ఞాన శిబిరాల కరపత్రాలు విడుదల చేస్తున్న రిటైర్డ్ ఎంఈఓ, లైబ్రేరియన్

తెర్లాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని విశాంత్ర ఎంఈఓ ఎం.సత్యనారాయణ అన్నారు. లైబ్రేరియన్ సీహెచ్.కృష్ణమూర్తితో కలిసి వేసవి విజ్ఞాన శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏటా మే నెలలో గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించి విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. విద్యార్థులంతా వీటిని సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. లైబ్రేరియన్ సీహెచ్.కృష్ణమూర్తి మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా ప్రతిరోజూ విద్యార్థులకు చిత్రలేఖనం, పుస్తక పఠనం, కథలు చెప్పడం, రాయించడం, క్విజ్ పోటీలు, గణితంలో మెలకువలు, తదితర అంశాలపై నిపుణులతో శిక్షణ ఇస్తామన్నారు. విద్యార్థులు క్రమతప్పకుండా శిక్షణ తరగతులకు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో తెర్లాం –5 అంగన్‌వాడీ కార్యకర్త వై.శ్రీదేవి, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ శ్రీరాం పాల్గొన్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి



రైల్వే ట్రాక్‌పై యువకుని మృత దేహం

బొబ్బిలి: సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసేందుకు స్వగ్రామం వచ్చిన యువకుడు రైలు ఢీకొని మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. తెర్లాం మండలం నందబలగకు చెందిన పక్కి రవి(21) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసేందుకు స్వగ్రామం వచ్చాడు. బుధవారం ద్విచక్రవాహనంపై బొబ్బిలి వచ్చాడు. ఎం.బూర్జవలస వద్ద రైల్వే ట్రాక్ ముందు వాహనాన్ని నిలిపి ట్రాక్ దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొని మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించారాఉ. దీనిపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓటెత్తిన పల్లె ప్రజలు

- గ్రామీణ ప్రాంతాల్లో పెరిగిన పోలింగ్
- 14 బూత్‌లతో 90 శాతం పోలింగ్ నమోదు

బొబ్బిలి: ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ భారీగా నమోదైంది. ఓటు హక్కు వినియోగంలో గ్రామీణ ఓటర్లు పట్టణ ఓటర్ల కంటే ముందున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 90 శాతం పోలింగ్ నమోదుకాగా.. పట్టణంలో 50 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలోని బొబ్బిలి, రామభద్రపురం, తెర్లాం, బాడంగి మండలాల్లో మొత్తం 264 పోలింగ్ కేంద్రాలున్నాయి. బొబ్బిలి మండలం పారాది పరిధిలోని బంకురువలస పోలింగ్ కేంద్రంలో అత్యధికంగా 93.25 శాతం పోలింగ్ నమోదయ్యింది. ఇక్కడ 87వ పోలింగ్ కేంద్రంలో 325 ఓట్లు ఉండగా 304 ఓట్లు పోలయ్యాయి. ఆ తరువాత రామభద్రపురం మండలం ఎస్.సీతారామపురం 112వ పోలింగ్ కేంద్రంలో 794 ఓట్లకు గాను 739 ఓట్లు పోలయ్యాయి. 93.07 శాతం ఓటింగ్ జరిగింది. అలాగే బొబ్బిలి మండలం ఎరకందొరవలసలో 92.57 శాతం పోలింగ్ నమోదైంది. ఈ కేంద్రంలో 404 ఓట్లకు గాను 374 ఓట్లు పోలయ్యాయి. అలాగే మెట్టవలస 90వ పోలింగ్ కేంద్రంలో 980 ఓట్లకు గాను 898 ఓట్లు పోలయి 91.63 శాతం పోలింగ్ నమోదయింది. బాడంగి మండలం హరిజన పాల్తేరులో 160 పోలింగ్ కేంద్రంలో 667 ఓట్లకు గాను 612 ఓట్లు పోలయి 91.75 శాతం పోలింగ్ నమోదయింది. రామభద్రపురం మండలం కె.పాలవలస 132 పోలింగ్ కేంద్రంలో 340 ఓట్లకు గాను 311 ఓట్లు పోలయి 91.47 శాతం పోలింగ్ నమోదైంది. ఎస్.చింతలవలస 133వ పోలింగ్ కేంద్రంలో 637 ఓట్లకు గాను 580 ఓట్లు పోలై 91.05 శాతం ఓటింగ్ నమోదయింది. పాడివానివలస 144 పోలింగ్ కేంద్రంలో 608 ఓట్లకు గాను 549 ఓట్లు పోలయి 90.30 శాతం పోలింగ్ జరిగింది. తారాపురంలోని 118 పోలింగ్ కేంద్రంలో 832 ఓట్లకు 750 ఓట్లు పోలయి 90.10 శాతం పోలింగ్ నమోదయింది. ఇక్కడే ఉన్న 119 పోలింగ్ కేంద్రంలో 707 ఓట్లకు 643 ఓట్లు పోలయి 90.95 శాతం పోలింగ్ నమోదయింది. ఇదే మండలం జన్నివలస 117 పోలింగ్ కేంద్రంలో 991 ఓట్లుంటే 895 ఓట్లు పోలై 90.31 శాతం పోలింగ్ నమోదయ్యింది.

పట్టణంలో..

ఇలా ఉండగా పట్టణంలోని హాస్పిటల్ రోడ్డు సీబీఎం స్కూల్‌లో మూడు పోలింగ్ కేంద్రాలున్నాయి. ఇక్కడ 38వ పోలింగ్ కేంద్రంలో 1321 ఓట్లుండగా 661 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. నియోజకవర్గంలోనే తక్కువగా 50.04 శాతం పోలింగ్ ఇక్కడే నమోదయింది. అలాగే ఇక్కడే ఉన్న 39వ పోలింగ్ కేంద్రంలో 1317 ఓట్లుండగా 697 ఓట్లు పోలై 52.92 శాతం ఓటింగ్ నమోదయింది. ఇక 40వ పోలింగ్ కేంద్రంలో 1324 ఓట్లకు గాను 697 ఓట్లు పోలయ్యాయి. 52.64 శాతం పోలింగ్ నమోదయింది.

గరిష్ట వేతన కల్పనే ప్రభుత్వ ధ్యేయం



సంతకవిటి: మండాకురిటిలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఏపీఓ హరనాథరావు

రామభద్రపురం: ఉపాధిహామీ వేతనదారులకు గరిష్ట వేతనం కల్పించడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ధ్యేయమని ఉపాధిహామీ ఏపీడీ కె.జనార్దన్ అన్నారు. స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో బుధవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వేతనదారులకు ఏ ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకుని రెండు పూటలా పని చేయించాలని, వేతనదారులు గరిష్ట వేతనం పొందేలా కొలతలు నిర్దేశించాలన్నారు. పనిలో పాల్గొనే వేతనదారుల సంఖ్య మరింత పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి పనుల్లో అక్రమాలకు తావులేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

కొలతల ప్రకారం పనులు చేయాలి

రాజాం: గ్రామాల్లో చేపడుతున్న ఉపాధిహామీ పనుల్లో భాగంగా టెక్నికల్ అసిస్టెంట్లు ముందుగా కొలతలు ఇవ్వాలని ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఉపయోగపడేలా పనులు చేయించాలని సూచించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉదయం, సాయంత్రం సమయాల్లో పనులు చేయించాలని, పని ప్రదేశం వద్ద తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. జాబ్‌కార్డులో పేరు ఉన్నవారికి తప్పనిసరిగా పనులు కల్పించాలని వివరించారు. కార్యక్రమంలో ఏపీఓ సాయిరాం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీడీ జనార్దన్

నిర్దేశిత కొలతల్లో పనిచేయాలి

సంతకవిటి: గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులు నిర్దేశిత కొలతల్లో చేయాలని ఏపీఓ హరనాథరావు అన్నారు. మండలంలోని మండాకురిటి, సురవరం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తే వేతనదారులకు రోజుకు రూ.300 వేతనం గిట్టుబాటు అవుతుందని పేర్కొన్నారు. ఆయన వెంట ఎఫ్ఏలు నారాయణరావు, చింతయ్య తదితరులు ఉన్నారు.

ఎండ సమయంలో పనిచేయొద్దు

రేగిడి: ఎండ తీవ్రత అధికంగా ఉన్న సమయంలో వేతనదారులు ఉపాధిపనులు చేయరాదని ఏపీఓ ఎస్.హరనాథరావు సూచించారు. మండలంలోని తోకలవలస పంచాయతీ లచ్చనవలస గ్రామంలో బుడితివానిచెరువులో చేపడుతున్న ఉపాధిపనులను బుధవారం ఆయన పరిశీలించారు. వేతనదారుల మస్తర్లు తనిఖీచేశారు. పనులు నిర్వహణపై అవగాహన కల్పించారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మణరావు, మేట్‌లు ఉన్నారు.